సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 5 । అక్టోబర్ । 2024



అండర్-14 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

కడపలో ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. -6లో



రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. -6లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.9

జిల్లాలో శుక్రవారం 23.9 – 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

కల్తీ మాటలపై కన్నెర్ర

పూటకో మాటతో ప్రజల్ని ఏమార్చాలని చూశారు. రోజుకో వేషంతో జనాల్ని మాయ చేయాలని కొత్త ఎత్తుగడ వేశారు. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా.. ఏకంగా దేవుడితోనే ఆటలాడే దుస్సాహసానికి ఒడిగట్టారు. వారి మోసపు మాటల్ని.. వింత నాటకాల్ని 'సుప్రీం' తిప్పి కొట్టింది. దెబ్బకు మాయలమారి 'నారా'వారి నక్క ముసుగు తొలగిపోయింది. జిత్తులమారి పవన్ ఆడిన నాటకాల పరదా పక్కకొరిగింది. కూటమి నేతలు చేస్తున్న లడ్డూ కల్తీ ఆరోపణలపై 'సుప్రీం కోర్టు' మాటల్లోనే కాదు.. ప్రజా కోర్టులోనూ ఆగ్రహం ఎగసిపడుతోంది. ఇది వైఎస్సార్‌సీపీ నైతిక విజయంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

- సుప్రీంకోర్టు తీర్పుతో ఖంగుతిన్న కూటమి ప్రభుత్వం
- రాజకీయ ప్రయోజనాల కోసం దేవదేవుడిని లాగిన బాబు, పవన్
- మండిపడుతోన్న ధార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు



సాక్షి ప్రతినిధి, కడప: తిరుమల లడ్డూ వివాదంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందంతో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. భక్తుల విశ్వాసంపై దెబ్బకొట్టిన చంద్రబాబుకు సుప్రీంతీర్పు చెంపపెట్టు లాంటిదని పలువురు వివరిస్తున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై పలు ధార్మిక సంఘాలు, ధార్మిక పరిషత్‌లు ఆవేదన చెందాయి. చంద్రబాబు కుట్రలు పసిగట్టిన వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ప్రతిఘటించింది. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తిరుమలలో ఏకంగా ప్రమాణం చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసింటే తమ కుటుంబం సర్వనాశనం కావాలని, రక్తం కక్కుకొని చనిపోవాలని ప్రమాణం చేశారు. వెరసి భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా చంద్రబాబు కుట్రలను బహిర్గతం చేశారు. మరో మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సత్యదూరమైన ఆరోపణలపై నిగ్గు తేల్చాలని, దేవదేవుడిపై భక్తులకున్న విశ్వాసం సన్నగిల్లకుండా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఐదుగురు బృందంచే విచారణకు ఆదేశించింది. లడ్డూ ప్రసాదంలో కల్తీ వ్యవహారంపై నిగ్గు తేల్చాలని నిర్ణయించింది.

▶▶ సుప్రీం తీర్పుతో కూటమి నేతలు విలవిల

ఓ వైపు సూపర్ సిక్స్ పథకాలు వందరోజులైనా అమలు చేయలేదు. మరోవైపు విజయవాడ వరద ప్రాంతాలను చక్కదిద్దలేదని ప్రజల నుంచి.. విపక్షనేతల నుంచి వెల్లువెత్తిన ఆరోపణలు. ఈ నేపథ్యంలో దిక్కుతోచని సీఎం చంద్రబాబు డైవర్ట్ పాలిట్రిక్స్‌కు తెరతీశారు. ఇందులో భాగంగానే లడ్డూ కల్తీ ఆరోపణలు చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రతిఘటించడంతో కూటమి సర్కార్ తోకముడిచింది. తాజాగా సుప్రీంకోర్టు విచారణ కు సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడం బాబు అండ్ కో నేతలకు ఎదురు దెబ్బగా పరిశీలకులు వివరిస్తున్నారు.

దర్యాప్తు లేకుండానే విమర్శలా!



ఎలాంటి దర్యాప్తు లేకుండానే తిరుమల లడ్డు ప్రసాదంపై ఆరోపణలు చేశారు. ప్రపంచ స్థాయిలో హిందువుల, భక్తుల ఆవేదనకు గురిచేశారు. ఇప్పుడు వారే అపఖ్యాతి పాలయ్యారు. తాజాగా సుప్రీం కోర్టు వ్యాఖ్యలు వీరికి చెంపపెట్టు.
– డాక్టర్ మూలె రామమునిరెడ్డి, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అర్చక బోధకుడు, ప్రొద్దుటూరు

'సుప్రీం' ఆదేశం ప్రభుత్వానికి చెంపపెట్టు



తిరుమల లడ్డుపై సుప్రీం కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు. వంద రోజుల పాలన నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికి ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇద్దరు సీబీఐ, ఇద్దరు రాష్ట్ర అధికారులు, నేషనల్ ఫుడ్ సేఫ్టీ అధికారులతో సిట్ వేయడాన్ని స్వాగతిస్తున్నాం.
–రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

నిజం నిలకడ మీద తెలుస్తుంది



అబద్ధాలు చెప్పి నిజాన్ని తాత్కాలికంగా దాచగలరేమోగానీ ఎల్లకాలం కాదు. తప్పులు చేసిన వారిని వెంకటేశ్వరస్వామి తప్పక శిక్షిస్తాడు.
–మాసీమబాబు, మాజీ సభ్యుడు,టీటీడీ బోర్డు

సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారంటూ చంద్రబాబు చేసిన దుష్ప్రచారం పై సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిది. ప్రజల మనోభావాలు దెబ్బ తీసే విధంగా చంద్రబాబు మాట్లాడటం తగదు. ఇప్పటికైనా చంద్రబాబు, పవన్ నోరు మూసుకోవాలి.
–పి.చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

భక్తులకు బాబు క్షమాపణ చెప్పాలి



శ్రీవారి భక్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. ఏ ఆధారాలతో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతీశారో చెప్పాలి. దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని సుప్రీం కోర్టు అక్షింతలు వేసింది. వైఎస్సార్‌సీపీపై బురద జల్లాలని సీఎం ప్రయత్నించారు. కానీ అది ఆయన ముఖంపైనే పడింది. – యానాదయ్య

దేవుడు క్షమించడు



శ్రీవేంకటేశ్వరస్వామి విషయంలో తప్పులు చేస్తే ఆ దేవదేవుడు క్షమించడు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా సీఎం స్థాయిలోని వ్యక్తి తిరుమల లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బ తీసేలా చేసిన ఆరోపణలు సరికాదు. సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయం.
–జి.పుల్లయ్య, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, బద్వేలు

బాబు, పవన్ కుట్రలకు ఎదురుదెబ్బ



లడ్డూ కల్తీపై ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వేసిన సిట్‌ను సుప్రీం కోర్టు రద్దు చేయటం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల చెంప చెళ్లమనిపించడమే. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు పొలిటికల్ డ్రామాకు తెరతీశారు.
– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

సుప్రీం కోర్టు తీర్పు సమర్థనీయం



చరిత్రలో ఇప్పటి వరకు ఎంత పెద్ద నాయకుడైనా దేవుని గురించి విమర్శలు చేసిన వారు లేరు. తిరుమల లడ్డును వివాదాస్పదం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. లడ్డుపై సుప్రీం కోర్టు తీర్పు సమర్థనీయం. – భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రొద్దుటూరు.

న్యూస్‌రీల్

రెండో రోజు 150 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాలలో 1155 మంది అభ్యర్థులకు గాను 150 మంది గైర్హాజరయారని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

రైతులకు కేంద్రం శుభవార్త

కడప అగ్రికల్చర్: పంట పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతులకు రూ. 2 వేలను శనివారం విడుదల చేయనుంది. మహారాష్ట్రలోని వాసిమమ్ నుంచి ప్రధాని మోదీ మధ్యాహ్నం 12 గంటలకు పీఎం కిసాన్ పథక 18వ విడత నిధులను విడుదల చేయనున్నారు. జిల్లాలో అర్హత కలిగిన 1,87,083 మంది రైతుల ఖాతాలకు రూ. 37.42 కోట్లు పెట్టుబడి సాయం నేరుగా జమకానుంది, తొలి విడతగా గత జూన్ 18న జిల్లాలో 1,86,507 మంది రైతులకు రూ. 37.36 కోట్లను రైతు ఖాతాలకు జమ చేశారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన రామగిడ్డయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ రామగిడ్డయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్‌గా ఉంటూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం జోన్ -4 పరిధిలో పనిచేస్తున్న రాయలసీమ ప్రాంత ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఆ శాఖ కార్యాలయ సిబ్బంది ఆర్డీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్ గోపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య, వనీష, రవి పాల్గొన్నారు.

డీపీఓగా రాజ్యలక్ష్మి



కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పంచాయతీ అధికారిగా రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న డీపీఓను రాష్ట్ర ప్రభుత్వం ఆదోని డీఎల్‌డీఓగా బదిలీ చేసింది. ఏపీఎస్ఐఆర్‌డీలో పనిచేస్తున్న రాజ్యలక్ష్మి ఇక్కడికి వచ్చారు.

రేపు 'గడియారం' పురస్కార సభ



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న గడియారం శేషశర్మ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు రచన సాహిత్యవేదిక ఉపాధ్యక్షుడు గడియారం వేంకటశేషశర్మ పేర్కొన్నారు. రామేశ్వరంలోని గడియారం వారి లైబ్రరీలో పురస్కారాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవి గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, వైద్యుడు డాక్టర్ శింగరాజు రామకృష్ణ ప్రసాదరావుకు అందిస్తున్నామన్నారు. ఆయన రచించిన ''శ్రీ శంభు భారతం''అనే కావ్యానికి ఈ పురస్కారం అందిస్తున్నామని చెప్పారు.

శివానీ.. భవానీ నమోస్తుతే

ప్రొద్దుటూరు కల్చరల్: దేవి శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో భవాని దేవిగా భక్తులను కరుణించారు. నరసింహాస్వామి, వివిధ దేవతా మూర్తుల సెట్టింగ్ ఆకట్టుకుంది. శివాలయంలో గజలక్ష్మీదేవిగా, గౌరమ్మకట్టలో బాలత్రిపుర సుందరిదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది.



అమ్మవారిశాలలో భవాని దేవిగా అమ్మవారి దర్శనం



అమ్మవారిశాలలో భక్తుల సందడి

పాలనా వ్యవహారాలపై అవగాహన ముఖ్యం

- జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: అధికారులు పాలనా వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్ అండ్ ఆర్డీలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అధికారులు ఇచ్చే శిక్షణ ఆకళింపు చేసుకుని గ్రామ పంచాయతీలలో అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీపీఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

'బ్రౌన్'భవనాలు ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలి

కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: సీపీ బ్రౌన్ గ్రంథాలయ అదనపు నూతన భవన నిర్మాణాలను ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆర్‌అండ్‌బీ, ఏపీ విద్యా సంక్షేమ అభివృద్ధి సంస్థ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో సీపీ బ్రౌన్ గ్రంథాలయం, భాష పరిశోధనా కేంద్రం అభివృద్ధిపై సమీక్షించారు. గతంలో గ్రంథాలయం అదనపు భవనాల నిర్మాణానికి స్థలం కొనుగోలు చేసినా, నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, పనులు ప్రారంభించక పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ గ్రంథాలయ ఆవిర్భావం, అంచెలంచెలుగా ఎదిగిన తీరును, నూతన భవనాల నిర్మాణ ఆవశ్యకతను గురించి వివరించారు. రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీరు చంద్రశేఖర్, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డా. జి. పార్వతి, ఇన్ ఛార్జి రిజిస్ట్రార్ రాంప్రసాద్ రెడ్డి, ఇంజనీర్లు కల్యాణి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

బదిలీ అయిన అధికారులు జిల్లాలో బాగా పని చేశారని, అదే స్ఫూర్తితో బదిలీ అయిన ప్రదేశంలో కూడా బాధ్యతాయుతంగా పనిచేసి ఆయా జిల్లాలకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా నుంచి బదిలీ అయిన అధికారులకు ఆత్మీయ అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి సేవలను కొనియాడారు. జిల్లా నుంచి జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీఓ వెంకటేష్, స్పెషల్ కలెక్టర్ కౌసర్ భాను, మున్సిపల్ కమిషనర్ ఓవై నందన్, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటసుబ్బయ్య బదిలీ అయ్యారు. ఆయా అధికారులకు కలెక్టర్ ఘనంగా సన్మానించారు. జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్, సీపీఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఇన్‌చార్జి బాధ్యతల తొలగింపు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం రద్దు
- నగరపాలక స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయాలు

కడప కార్పొరేషన్: వార్డు సచివాలయాల సెక్రటరీలకు ఇచ్చిన ఇన్‌చార్జి బాధ్యతలు తొలగిస్తూ నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన ఆయన చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు ప్రజారోగ్య విభాగంలో శానిటేషన్ సెక్రటరీలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా, ఎమినిటీస్ సెక్రటరీలకు ఏఈలుగా, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలకు టీపీబీఓలుగా, అడ్మిన్ సెక్రటరీలకు ఆర్‌ఐలుగా ఇన్‌చార్జిలుగా వేసి సీనియర్లకు మొండిచేయి చూపారు. అలాగే కంట్రోల్ రూములో 11 మంది సెక్రటరీలను నియమించి 100 సచివాలయాల సెక్రటరీలను వారి పరిధిలోకి తెచ్చారు. దీంతో ఈ 30 మంది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిపై విమర్శలు వెల్లువెత్తడంతో స్టాండింగ్ కమిటీ వారిని ఇదివరకు పనిచేసిన స్థానాలకు పంపాలని నిర్ణయించారు. ఆ కమిషనర్ ఉన్నప్పుడే 20మంది వలంటీర్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఏర్పాటు చేశారు. పన్నుల వసూళ్లు, ప్లాస్టిక్ నిషేధం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి వాటికి వారిని వినియోగిస్తున్నట్లు చెప్పి వారికి రూ.5వేలుగా ఇస్తున్న జీతాన్ని రూ.12వేలకు పెంచారు. ప్రస్తుతం సరిపడినంతమంది సెక్రటరీలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వీరి అవసరం లేదని భావించి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

- నగరంలో పార్కులు, సెంట్రల్ మీడియన్లు, సర్కిళ్లు, అవెన్యూ ప్లాంటేషన్, ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయుటకు హార్టికల్చర్ విభాగంలో 12 మంది అదనపు వర్కర్లు తీసుకునే అంశంపై కార్పొరేటర్లు, అధికారులతో కమిటీ వేయాలని తీర్మానించారు.
- కడప నగరంలో వీధి కుక్కల బెడద నివారణకు, కుక్క కాటు బారిన పడిన వారికి రేబిస్ వ్యాధి రాకుండా వీధి కుక్కల జనన నియంత్రణ నిర్వహించేందుకు టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు.
- నగరపాలక సంస్థలో వివిధ స్కీముల ద్వారా జరిగే అభివృద్ధి పనులను తనిఖీ చేసి క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ స్పెక్ట్రమ్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ, హైదరాబాద్ వారి సేవలు మరో రెండు నెలలు పొడిగించాలని తీర్మాణించారు.
- నగరపాలక పరిధిలో చికెన్ మాంసపు దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను తరలించడానికి వేలం పాటలో కాంట్రాక్టు పొందిన బీడీ రాజు అనే వ్యక్తిచేత రూ.10లక్షల సొమ్ము కట్టించుకున్న తర్వాత మూడు నెలల అదనపు గడువు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసిన నేపథ్యంలో చెత్త పన్ను ఎవరూ చెల్లించడం లేదు. దీంతో కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడే అవకాశముందని, ప్రస్తుతం తిరిగే క్లాప్ వాహనాలకు మాత్రమే అదనపు వర్కర్లను వినియోగించాలని, మిగిలిన వారిని కొనసాగించరాదని తీర్మాణించారు.




స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

▶▶ ప్రొటోకాల్ పాటించకపోవడంపై మేయర్ ఆగ్రహం

ఇటీవల ఎర్రముక్కపల్లెలోని గాంధీ ప్లాజా ప్రారంభోత్సవంలో మేయర్, కార్పొరేటర్లకు ఆహ్వానం పంపకపోవడంపై మేయర్ సురేష్ బాబు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, స్థానిక వార్డు ఎమినిటీస్ సెక్రటరీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను ఆహ్వానించకుండా, తమ పేర్లు శిలాఫలకంలో రాయకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించిన మీపై తగిన చర్యలు తీసుకుంటామని, న్యాయ పోరాటం కూడా చేస్తామని హెచ్చరించారు. ఐఈసీ టీంను రద్దు చేయాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు తెలుపగా...ఆ టీం ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసి జరిమానాల రూపంలో రూ.25లక్షలు వసూలు చేసిందని ఏడీసీ రాకేష్ చంద్ర చెప్పగా...మరోసారి మేయర్ ఆగ్రహించారు. తాము ఇంకా ఎక్కువ వసూలు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ వైఓ నందన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, సుజాత, గౌస్ జబీన్, కె. అరుణప్రభ, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఏసీపీలు నాగేంద్ర, మునిరత్నం, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్: పంటలకు సోకిన తెగుళ్ల, పురుగులకు సంబంధించిన ఫొటోలను సీఎల్ఎస్(క్రాప్ లైఫ్ సిస్టమ్) పిడిఎస్ఎస్(పెస్ట్ డిసీజ్ సర్వివలెన్స్ సిస్టమ్)యాప్‌లలో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు పేర్కొన్నారు. విజయవాడ్ డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు పరిశీలించి వాటికి తగిన పరిష్కారాలను చూపుతారని పేర్కొన్నా రు. శుక్రవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లాలోని రైతు సేవా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌కు సీఎల్ఎస్, పీడీఎస్ఎస్ యాప్‌ల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రబీ సీజన్‌లో ప్రధానపంటలైన శనగ, వేరుశనగ పంటలలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాల పంపిణీ రిజిస్ట్రేషన్‌ను కూడా వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆయన సూచించారు. ఆత్మపీడి విజయలక్ష్మి, డాట్ సెంటర్ సైంటిస్టు అంకయ్యకుమార్, రైతు శిక్షణా కేంద్ర డీడీ రమణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి,డీపీడీ పద్మలత, డీఆర్‌సీ ఏవో పద్మజ, శివశైలజ, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

చక్రాయపేట : మండలంలోని ఎర్రబొమ్మనపల్లె గ్రామం సిద్దారెడ్డిపల్లె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 89 మద్యం టెట్రా ప్యాకెట్ల (90 ఎంఎల్‌)ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రంగారావు తెలిపారు. మద్యం ప్యాకెట్లతో పాటు ఇద్దరు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంచాయతీరాజ్‌లో 302 మంది బదిలీ

కడప సెవెన్‌రోడ్స్‌ : పంచాయతీరాజ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం భారీగా బదిలీ చేసింది. జిల్లాలో 302 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గ్రేడ్‌–1 నుంచి గ్రేడ్‌–4 వరకుగల గ్రామ పంచాయతీ కార్యదర్శులు 48 మంది, గ్రేడ్‌–5 గ్రామ పంచాయతీ కార్యదర్శులు 99మంది, గ్రేడ్‌–6 డిజిటల్‌ అసిస్టెంట్లు 87 మంది, రిక్వెస్ట్‌ బదిలీల కింద 68 మంది వీరిలోఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతుడు రాజశేఖర్‌

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామంలో గురువారం రాత్రి వల్లెపు రామశేఖర్‌ (48 కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ హాజీ బాషా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురిజాల గ్రామానికి చెందిన వల్లెపు రామ శేఖర్‌ కడుపు నొప్పితో గతకొంతకాలంగా బాధపడుతుండేవాడని.. గురువారం రాత్రి కడుపు నొప్పి తీవ్రకావడంతో తాళలేక తన ఇంటి సమీపాన చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతునికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

అమ్మవారి వెండి కిరీటం చోరీ

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు వెలుపల ఉన్న గంగమ్మ అమ్మవారు వెండి కిరీటాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయ పరిసరాలలో ఎవరులేకపోవడం చేసి ఆలయంలోకి వెళ్లి అమ్మవారి కిరీటాన్ని ఎత్తుకెళ్లారు. సాయంత్రం విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పిడుగుపడి ఆవు, కోడెదూడ మృతి


మృతి చెందిన ఆవు, కోడె దూడలు

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం బి.చెర్లోపల్లె గ్రామంలో పిడుగు పడి ఆవు, కోడె దూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన అన్నవరం సతీష్‌కుమార్‌ రెడ్డి ఆవు, కోడె దూడలను పొలం వద్ద మేపుతున్నాడు. శుక్రవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు ఆవు, కోడె దూడ మృతి చెందాయి. రైతు సతీష్‌ రెడ్డి మాట్లాడుతూ పిడుగు పడి ఆవు, దూడ మృతి చెందడంతో సుమారు రూ.2లక్షల మేర నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

కడపఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్‌ : జిల్లా రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి కోరారు. విజయవాడలో దక్షిణమధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ రాష్ట్ర ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అవినాష్‌రెడ్డి పలు సమస్యలు ప్రస్తావించారు. చాలా కాలంగా జిల్లాలో రైల్వే సమస్యలు ఉన్నందున ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తోందని తెలిపారు. సానుకూల దృక్పథంతో రైల్వే సమస్యలను పరిష్కరించాలన్నారు. కొత్త రైళ్లు, అదనపుకోచ్‌లు, గతంలో ఉన్న స్టాపింగ్‌ల పునరుద్దరణ వంటి అనేక అంశాలను వైఎస్‌ అవినాష్‌రెడ్డి ఈ సందర్భంగా జనరల్‌ మేనేజర్‌ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీ ప్రస్తావించిన సమస్యలను సావధానంగా ఆలకించిన జీఎం వీటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

హమ్‌ సఫర్‌ ఎక్స్‌ప్రెస్‌ కడపలో ఆపాలి

జమ్మూతావీ– తిరుపతి మధ్యనడిచే హమ్‌ సఫర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు జిల్లా కేంద్రమైన కడపలో ఆగేవిధంగా చూడాలని ఎంపీ కోరారు. మాతా వైష్ణోదేవీ ఆలయాన్ని సందర్శించే యాత్రికులతో పాటు, సైనికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చెన్నై నుంచి అహ్మదాబాద్‌ వెళ్లే హమ్‌ సఫర్‌ ఎక్స్‌ప్రెస్‌ ను కడపలో ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు వల్ల కడపలో ఉన్న గుజరాత్‌, రాజస్థాన్‌ వ్యాపారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు.


విజయవాడలో దక్షిణమధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ను కలిసిన కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి

స్టాపింగ్‌లు పునరుద్ధరించాలి

హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌ గతంలో కమలాపురం, ముద్దనూరు, కొండాపురంలలో గేదన్నారు. కరోనా వచ్చాక స్టాపింగ్‌లు రద్దు చేశారన్నారు. చెన్నై– ముంబాయి ఎక్స్‌ప్రెస్‌, మెయిల్‌కు గతంలో కమలాపురం, ముద్దనూరు, కొండాపురంలలో స్టాపింగ్‌లు ఉండేవని.. కరోనా వల్ల రద్దు చేశారన్నారు. పునరుద్ధరించాలని కోరారు. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ గతంలో ముద్దనూరు, కొండాపురంలలో ఆగేదని, కరోనా కారణంగా ఈ స్టాపింగ్‌లను కూడా రద్దు చేశారని ఎంపీ అవినాష్‌ రెడ్డి పేర్కొన్నారు.

రేణిగుంట నుంచి మరో ప్యాసింజర్‌

నంద్యాల–రేణిగుంట మెమో ప్యాసింజర్‌ గత సంవత్సరం ప్రారంభించారని ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ రైలు రోజుకు ఒక ట్రిప్పు మాత్రమే నడుస్తోందని తెలిపారు. ఇదే మార్గంలో మరో ప్యాసింజర్‌ రైలును ఉదయం వేళ రేణిగుంట నుంచి ప్రారంభిస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వారణాసికి రైలు సౌకర్యం

కడప, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి నేరుగా వారణాసి రైలు సౌకర్యం లేదన్నారు. ఈ సౌకర్యంకల్పించాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు కోరుతూ వస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి నుంచి కడప, కర్నూలు, కాచిగూడ మీదుగా వారణాసికి నేరుగా రైలు సౌకర్యాన్ని కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌

వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను ప్రవేశ పెడుతున్నప్పటికీ జిల్లా వాసులకు ఈ సౌకర్యం ఇంతవరకు కల్పించలేదని ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వందేభారత్‌ స్లీపర్‌ రైళ్లనుకూడా త్వరలో ప్రవేశ పెడుతున్నారన్నారు. తిరుపతి–సికింద్రాబాద్‌ మధ్య కడప మీదుగా వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలును ప్రవేశ పెట్టాలని కోరారు. ఇందుకు జీఎం స్పందిస్తూ ఇది రైల్వే బోర్డు తీసుకోవాల్సిన విధాన పరమైన నిర్ణయమని తెలిపారు. ముదిగుబ్బ–పులివెందుల మీదుగా పుట్టపర్తి నుంచి ముద్దనూరుకు కొత్త రైల్వేలైన్‌ ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

అండర్‌–14 అంతర్‌ జిల్లాల క్రికెట్‌ మ్యాచ్‌ ప్రారంభం

తొలి మ్యాచ్‌లో ఆధిక్యంలో చిత్తూరు జట్టు


షరీక్‌ అక్తర్‌, చిత్తూరు (53 పరుగులు)


రక్షణ్‌సాయి, చిత్తూరు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్‌ : కడప నగరం వేదికగా ఏసీఏ అంతర్‌ జిల్లాల అండర్‌–14 మల్టీడేస్‌ క్రికెట్‌ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కడప వైఎస్‌ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్‌ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుంది. 58.5 ఓవర్లలో 85 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని బి. మోక్షజ్ఞరెడ్డి 29 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్‌ రక్షణ్‌సాయి 5 వికెట్లు, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 38 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. జట్టులోని షరీఫ్‌ అక్తర్‌ 53 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు వివేక్‌ 3, అంకిత్‌ పరీక్‌ 2 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 2 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో ప్రకాశం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన విశాఖ జట్టు ఫీల్డింగ్‌ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 77 ఓవర్లలో 114 పరుగులు చేసి ఆలౌట్‌ అయింది. జట్టులోని రాజ్‌మోహన్‌ 28 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు వినోద్‌ 2, లోహిత్‌రాఘవేంద్ర 2 , ప్రఖ్యాత్‌వర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసింది. జట్టులోని అక్షిత్‌రెడ్డి 18 పరుగులు చేశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి విశాఖ జట్టు 52 పరుగుల తేడాతో వెనుకంజలో ఉంది.

పొలం రస్తా కోసం తగాదా

తోపులాటలో వ్యక్తి మృతి


మృతుడు రామక్రిష్ణారెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని అప్పారావుపల్లెలో దారుణం చోటు చేసుకుంది. పొలం రస్తా విషయంలో జరిగిన తగాదాలో స్వల్ప తోపులాటలో గ్రామానికి చెందిన శీలం రామక్రిష్ణారెడ్డి (66) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడు రామక్రిష్ణారెడ్డి పొలం పక్కనే అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్‌ రెడ్డి, ఎల్లారెడ్డి పొలాలు ఉన్నాయి. వారిద్దరి పొలాల పై భాగాన శంకర్‌ రెడ్డి అనే రైతు పొలం కూడా ఉంది. శంకర్‌ రెడ్డి తన పొలానికి వెళ్లాలంటే విశ్వనాథ్‌ రెడ్డి, ఎల్లారెడ్డి పొలాల్లో నుంచి వెళ్లాలి. తన పొలంలోకి వెళ్లేందుకు రస్తా ఇవ్వాలని శంకర్‌ రెడ్డి అడిగినప్పటికి వారిద్దరూ అందుకు అంగీకరించలేదు. దీంతో మృతుడు రామక్రిష్ణారెడ్డి మధ్యవర్తిగా వ్యవహరించి శంకర్‌రెడ్డికి వేరే మార్గంలో వెళ్లేలా పంచాయతీ చేసి దారి ఏర్పాటు చేశాడు. దీంతో మృతునికి, విశ్వనాథ్‌రెడ్డి, ఎల్లారెడ్డిల మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. మాకు తెలియకుండా శంకర్‌రెడ్డికి దారి ఇప్పిస్తావా? అని గురువారం రాత్రి రామక్రిష్ణారెడ్డితో వారిద్దరు వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో వారు రామక్రిష్ణారెడ్డిని తోసేశారు. స్టంట్‌ వేయించుకున్న అతను సొమ్మసిల్లి కింద పడి పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అతడిని చిక్సి నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, వివాహిత కుమార్తె ఉన్నారు. రామక్రిష్ణారెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పురుగు మందు సేవించి వృద్ధుడు మృతి

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన రామ సుబ్బయ్య (73) పురుగు మందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామ సుబ్బయ్యకు మద్యం అలవాటు ఉంది. అయితే గత కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అవయవాలన్నీ దెబ్బతిన్నాయని, ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రామసుబ్బయ్య ఇంటి వద్దనే ఉన్నాడు. జీవితంపై విరక్తి కలిగిన అతను గురువారం రాత్రి పొద్దుపోయాక మద్యంలో పురుగు మందు కలుపుకుని సేవించాడు. వాంతులు చేసుకుంటూ కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. అవుట్‌ పోస్ట్‌ పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

– జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు


స్పోర్ట్స్‌మీట్‌కు విచ్చేసిన జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబును సత్కరిస్తున్న వైద్యాధికారులు

కడప అర్బన్‌ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్‌) ఆవరణంలో శుక్రవారం స్పోర్ట్స్‌మీట్‌ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభించడానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబుకు, రిమ్స్‌ అధికారులు, వైద్య విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల భవనం ముందు వైద్య విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలను విశేషంగా ప్రదర్శించి అందరిని అలరించారు. అనంతరం కళాశాల కాన్ఫరెన్స్‌ హాల్‌లో వైద్య విద్యార్థులు. వైద్యఅధ్యాపకులు, సిబ్బందిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తాను పాఠశాలకు వెళ్లే సమయం నుంచే క్రీడలపై ఆసక్తి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి తమ చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్‌) ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏ. సురేఖ, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి, ఐఎంహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆర్‌.వెంకటరాముడు, జీఎంసీ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విజయ భాస్కర్‌రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా టెకీ ఆత్మహత్య

– మృతురాలు కడప నగరవాసి


గౌతమి(ఫైల్‌)

బనశంకరి : ఐదో అంతస్తునుంచి దూకి మహిళా టెకీ ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏపీలోని వైఎస్సార్‌ జిల్లా కడప నగరానికి చెందిన గౌతమి(27) బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌ ప్రశాంత్‌ లేఅవుట్‌లో ఉన్న పీజీలో నివాసం ఉంటూ టీసీఎస్‌ కంపెనీలో పనిచేస్తోంది. ఏం జరిగిందో ఏమో కాని శుక్రవారం తానుంటున్న పీజీ ఐదో అంతస్తుపైకి వెళ్లి దూకింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. పీజీ నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. ఆమె ఉంటున్న గదిలో పరిశీలించగా ఒక లేఖ లభించింది. తన మృతిపై ఎలాంటి దర్యాప్తు చేయరాదని, మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా తల్లిదండ్రులకు అప్పగించాలని గౌతమి ఆ లేఖలో రాసినట్లు పోలీసులు తెలిపారు. కాగా వైదేహి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

సబ్సిడీతో శనగలు ఇవ్వాలని వినతి

కడప అగ్రికల్చర్‌ : రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అందించే శనగ విత్తనాలు నాసిరకం, పుచ్చులు లేకుండా నాణ్యమైన శనగ విత్తనాలను సరిపడా అలందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఏపీ సీడ్స్‌ జిల్లా మేనేజర్‌ జగదీస్‌ను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకుపైగా శనగ పంటకు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారన్నారు. నాణ్యమైన శనగలు ఇవ్వాలని ఆయన కోరారు.

గాలి, వాన బీభత్సం

చాపాడు : మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం, రాత్రి కురిసిన గాలి, వాన బీభత్సం సృష్టించింది. అర గంటలకు ఏకదాటిగా ఈదురు గాలులతో భారీ వర్షం కురవగా పలు గ్రామాలలో పెద్ద ఎత్తున చెట్లు పడిపోయాయి. ఇదే క్రమంలో గుంతచీపాడు గ్రామంలో పిడుగు పాటుకు పలువురిరి ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్‌ లైట్లు కాలిపోయాయి. మైదుకూరు ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారి వెంట చాలా చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఖాదర్‌పల్లె గ్రామంలో భారీ చెట్టు వరిగి గ్రామానికి చెందిన చాంద్‌గారి పక్రువల్లీ, సాహిదా దంపతుల ఇళ్లు కూలిపోయింది.

60 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

వేంపల్లె : గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి మండలంలోని అలిరెడ్డి పల్లె, ఇడుపులపాయి, ఎగువ తువ్వపల్లె గ్రామాలలో దాదాపు 60 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్‌ వరి పంట పొలాలను సందర్శించారు.

ఈదురు గాలులతో వర్షం

రాజుపాళెం : ఉన్నట్లుండి ఒక్కసారిగా గురువారం సాయంత్రం గాలి, వానా బీభత్సం సృష్టించింది. కొన్ని గ్రామాల్లో గాలులు వీయడంతో జొన్న పంట నేలవాలగా కొన్ని రకాల పంటల్లో నీళ్లు నిలిచాయి. తిరిగి శుక్రవారం సాయంత్రం కూడా ఈధురు గాలులతో కూడిన వర్షం పడటంతో పంటలు దెబ్బతింటాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.


ఖాదర్‌పల్లెలో చెట్టు పడి కూలిపోయిన ఇంటి వద్ద బాధితులు సాహిదా, ఫక్రువల్లీ

వర్షాల వల్ల విద్యుత్‌ శాఖకు రూ.40లక్షలు నష్టం

కడప కార్పొరేషన్‌ : రెండు రోజులుగా జిల్లాలో కురిసిన గాలి,వాన బీభత్సం వల్ల విద్యుత్‌ శాఖకు సుమారు రూ.40లక్షలు నష్టం సంభవించింది. వైఎస్సార్‌ జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్‌ స్తంభాలు విరిగిపోగా, విద్యుత్‌ లైన్లు తెగిపడ్డాయి. ఫలితంగా చాలా గ్రామాల్లో కరెంటు లేక అంధకారం నెలకొంది. విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.

హౌసింగ్‌ ఇసుక స్కాంలో ఏఈ సస్పెన్షన్‌


ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌ సమావేశంలో వృత్తంలో మునిశేఖర్‌రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: ప్రొద్దుటూరులోని జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక స్కాంలో ఓ ఏఈని సస్పెండ్‌ చేయడంతోపాటు ముగ్గురు వర్క్‌ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి ఉన్నతాధికారులు తొలగించారు. అర్హులైన పేదలందరికి ఇళ్లు నిర్మించాలనే ఉన్నతాశయంతో గత ప్రభుత్వం ఒకే మారు అందరికి ఇళ్లు మంజూరు చేసింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీతోపాటు కొత్తపల్లె, గోపవరం, దొరసానిపల్లె, సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు 20వేల ఇళ్లు మంజూరు చేశారు.

ఏఈ సస్పెండ్‌: ప్రొద్దుటూరు అర్బన్‌ ఏఈగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వర్లను ఉన్నతాధికారులు సస్పెండ్‌ చేశారు. అలాగే ఔట్‌సోర్సింగ్‌ కింద పనిచేస్తున్న ఇందిర, కుమారి, గుర్రప్ప అనే వర్క్‌ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తొలగించారు.

10వేల మెట్రిక్‌ టన్నుల ఇసుక మాయం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సుమారు 48వేల మెట్రిక్‌ టన్నుల ఇసుకను అధికారులు దిగుమతి చేసుకున్నారు. ఇందులో 10వేల మెట్రిక్‌ టన్నుల ఇసుకకు సంబంధించి వినియోగించినట్లు ఆధారాలు లేకపోవడంతో ఇసుక మాయం అయిందని విజిలెన్స్‌ అధికారుల విచారణలో వెల్లడైంది. వీరి సిఫారస్సు మేరకు హౌసింగ్‌ అధికారులు చర్యలు తీసుకున్నారు.

టీడీపీ కాంట్రాక్టరే కీలకం

జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి చాపాడు మండలానికి చెందిన టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి కాంట్రాక్టర్‌గా ఉన్నారు. ఈయన బొల్లవరం లే అవుట్‌లో ఇళ్లను నిర్మిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఇసుకను ఈ కాంట్రాక్టర్‌కు సరఫరా చేసినట్లు సమాచారం. ఈయన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌కు ముఖ్య అనుచరుడుగా ఉన్నారు. ఇళ్ల నిర్మాణంలో తీవ్రం జాప్యం చేస్తున్నాడని గతంలోనే అధికారుల సమీక్షా సమావేశంలో మునిశేఖర్‌రెడ్డి పనితీరుపై అధికారులు ఆరోపణలు చేశారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ ఉత్తమ పురస్కారాలు ప్రదానం

వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి


పురస్కారాలు ప్రదానం చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌, ప్రిన్సిపాల్‌ తదితరులు

వైవీయూ : సమాజ సేవ చైతన్యంలో మీ మార్గం అనుసరణీయం, ఆదర్శనీయమని యోగివేమన విద్యాలయం వైస్‌ చాన్సలర్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం యోగి వేమన విశ్వవిద్యాలయం 2023–24 విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయ స్థాయి జాతీయ సేవా పథకం పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ 'దేశం అంటే మట్టి కాదోయ్‌ దేశం అంటే మనుషులోయ్‌' అన్న మహాకవి గురజాడ మాటలను అందిపుచ్చుకొని దేశ సౌభాగ్యం కోసం పాటుపడాలని సూచించారు. విశ్వవిద్యాలయంలోనూ, అన్ని కళాశాలలు సమాజంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేసిన కళాశాలల ప్రిన్సిపాల్‌లు, పీఓలు, వలంటీర్లు అభినందనీయులన్నారు. రిజిస్ట్రార్‌ ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథ రెడ్డి, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్త డా. ఎస్‌ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కళాశాలల తరపున డాక్టర్‌ సి.యోగాంజనేయులు,(ప్రిన్సిపాల్‌, వైఎస్‌ఆర్‌వి గవర్నమెంట్‌ జూనియర్‌ కాలేజ్‌, వేంపల్లి), డాక్టర్‌ కె. వెంకటసుబ్బారెడ్డి (ప్రిన్సిపాల్‌, ఎస్‌.బి.వి.ఆర్‌. డిగ్రీ కళాశాల, బద్వేల్‌), షేక్‌ నూర్జహాన్‌ (ప్రిన్సిపాల్‌, ప్రభుత్వం బాలుర జూనియర్‌ కాలేజి)లకు జ్ఞాపిక, ప్రశంస పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. డి మానస, (యూనిట్‌ 9 వైవీయూ), ఐ మహబూబ్‌ బాషా (ఎస్బిఎస్వైఎం డిగ్రీ కళాశాల మైదుకూరు) మీనాక్షి, (ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల, కడప) లకు ఉత్తమ వలంటీర్‌ పురస్కారం అందజేసి సత్కరించారు.

రాజీనామా పత్రాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఆ రోజు మా పెద్దనాన్నను చూసి మున్సిపల్‌ ఛైర్మన్‌ పదవీ ఇచ్చాం
- ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీకి కంచుకోట
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డితో మాట్లాడి మా పెద్దనాన్న మాజీ మంత్రి డాక్టర్‌ మైసురారెడ్డిని చూసి మున్సిపల్‌ ఛైర్మన్‌గా మూలె హర్షవర్ధన్‌రెడ్డిని కౌన్సిలర్లుందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్‌ కౌన్సిలర్లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీకి కంచుకోట అన్నారు. కౌన్సిలర్లు అందరు వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నారు. నీవు రాజీనామ పత్రాన్ని వెనిక్కి తీసుకోని పార్టీని నడిపించాలని హర్షవర్ధన్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కౌన్సిలర్లు కో–ఆప్షన్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ కుల గణాంకాలతోనే సామాజిక న్యాయం

ఏపీ ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ


మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ, తదితరులు

పులివెందుల టౌన్‌ : కుల గణాంకా ఎస్సీ కుల గణాంకాలతోనే మాదిగ ఉప కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఏపీ ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి షెడ్యూల్డ్‌ కులాలకు 15 శాతం రిజర్వేషన్లు మించలేదని.. 1950లో నూతన రాజ్యాంగంలో ఆనాటి జనాభాకు అనుగుణంగా ఇచ్చిన రిజర్వేషన్లు దాదాపు 75ఏళ్లు దాటిన,ఎస్సీ జనాభా పదిరెట్లు పెరిగినా కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచలేదన్నారు. దేశంలోని రిజర్వేషన్లు ఆయా కులాల జనాభా వారు ఒకే విధంగా లేరని, ఎస్సీ కులాల జనాభా సేకరణ గత ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా సర్వే చేయలేదన్నారు.

అనుమతి లేని విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు


రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ప్రొద్దుటూరు : వ్యవసాయ శాఖ అనుమతి లేని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తే క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని విజయలక్ష్మి ఆగ్రో ఏజెన్సీస్‌, వీరభద్ర ఆగ్రో కెమికల్స్‌, శ్రీవెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్‌ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఏడీఏలు అనిత, మాధవి తనిఖీ చేశారు. డీఏఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర ఆగ్రో కెమికల్స్‌లో రూ.12,190 సంబంధించి ఎరువులకు పత్రాలు సరిగా లేనందును అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. అలాగే శ్రీవీరభద్ర ఆగ్రో కెమికల్స్‌లో రూ.30,800 విలువగల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏడీఏ సురేష్‌ రెడ్డి, ఏఓలు శివశంకర్‌రెడ్డి, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

జిల్లాలో రెండవ రోజు వర్షం

కమలాపురంలో అత్యధికంగా 41.4 ఎంఎం వర్షపాతం నమోదు


రాజుపాళెం మండలం కలూరులో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

కడప అగ్రికల్చర్‌: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలో రెండవ రోజు శుక్రవారం వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురువగా ఇందులో కమలాపురంలో అత్యధికంగా 41.4 ఎంఎం వర్షం కురిసింది. అలాగే పులివెందుల్లో 37.2 ఎంఎం, లింగాలలో 36. 2 ఎంఎం, చాపాడులో 34.8 ఎంఎం, వల్లూరులో 34.6 ఎంఎం, కొండాపురంలో 27.8 ఎంఎం, వీఎస్‌పల్లిలో 22.6 ఎంఎం, కడపలో 20.2 ఎంఎం, వేంపల్లిలో 18.2 ఎంఎం, పెండ్లిమర్రిలో 17.4 ఎంఎం, మైదుకూరులో 17 ఎంఎం, పొద్దుటూరులో 13.4 ఎంఎం, సిద్దవటంలో 11 ఎంఎం, చెన్నూరులో 9.8 ఎంఎం, ఖాజీపేటలో 9.8 ఎంఎం, మైలవరంలో 9.6 ఎంఎం, రాజుపాలెంలో 9.4 ఎంఎం, పెద్దముడియంలో 8.2 ఎంఎం, జమ్మలమడులో 7.4 ఎంఎం, సింహాద్రిపురంలో 6.8 ఎంఎం, సికెదిన్నెలో 6.6 ఎంఎం, తొండూరులో 4.6 ఎంఎం , ఒంటిమిట్టలో 4.2 ఎంఎం, చక్రాయపేటలో 4 ఎంఎం, ఎర్రగుంట్లలో 2.8 ఎంఎం, అట్లూరులో 1.2 ఎంఎం, ముద్దనూరులో, కాశినాయన మండలంలో 1 ఎంఎం, బద్వేల్‌లో 0.6 ఎంఎం వర్షం నమోదైయింది.